# తులసిపేట దళితులకు డి-పట్టా భూములను సర్వేచేసి అప్పగించాలి

- తహాశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా, వినతిపత్రం అందజేసిన నేతలు
- ఆక్రమణదారులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి
- ఫిబ్రవరి20వ తేది నుండి రిలే దీక్షలు

**విశాలాంధ్ర-కోటబొమ్మాళి** : మండలం చిట్టివలస రెవెన్యూ గ్రామంలో చిట్టివలస దళితులకు ఇచ్చిన డి-పట్టా భూములను సర్వే చేసి అప్పగించాలని, లేని యెడల ఫిబ్రవరి 20వ తేది నుండి భూములు అప్పగించే వరకూ రిలే దీక్షలు చేస్తామని దళిత హక్కుల పోరాట సమితి శ్రీకాకుళం జిల్లా సమితి డిమాండ్ చేసింది. బుధవారం కోటబొమ్మాళి మండల తహశీల్దార్ కార్యాలయం ముందు డిహెచ్‌పిఎస్ ఆధ్వర్యంలో తులసిపేట దళితులు ధర్నా చేశారు. గతంలో ప్రభుత్వం తులసిపేట దళితులకు ల్యాండ్ సీలింగ్ భూములకు డి పట్టాలు అందించిందని, కొన్నేళ్ళు సాగు చేసిన తర్వాత కొంత మంది ఆక్రమణచేసి సాగు చేస్తున్నారని డి పట్టాదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డిహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాల పోలారావు, యడ్ల గోపి, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి అనపాన షణ్ముఖరావు మాట్లాడుతూ పిఓటి యాక్ట్‌ను పటిష్టంగా అమలుచేయాలని డిమాండ్ చేశారు. భూ బదలాయింపు నిషేధిత చట్టం సవరణ చేయుటకు ప్రభుత్వం వేసిన ధర్మాన ప్రసాదరావు కమిటీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పేదలకు అందించిన డి పట్టా భూములను పేదలకు స్వాధీనం చేయాల్సింది పోయి, పిఓటి చట్టాన్ని సవరణచేసి నిర్వీర్యం చేయుటకు పూనుకుందని ఆరోపించారు. అంతకుముందు కోనేరు రంగారావు కమిటీ సిఫార్సుల మేరకు ప్రతీ దళిత కుటుంబానికి మూడెకరాల భూమిని అందించాలని, దళితుల డి-పట్టా భూములను సర్వేచేసి వెంటనే అప్పగించాలని, ఆక్రమణలు చేసి సాగుచేస్తున్న వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని, రాజ్యాంగంలో దళితులకు కల్పించిన హక్కులు అమలుచేయాలని నినాదాలు చేశారు. ధర్నా శిభిరం వద్దకు వచ్చిన మండల తహాశీల్దార్ జామి ఈశ్వరమ్మకు వినతిపత్రం అందించారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తులసిపేట డి-పట్టాదారుల కుటుంబా లకు చెందిన దళితులు, డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యవర్గ సభ్యులు చిట్టి సింహాచలం, బలగ రామారావు, జామాన రామారావు, బమ్మిడి వేణు, డిహెచ్‌పిఎస్ చిట్టివలస నాయకులు పాల్గొన్నారు.

## జిల్లాలో నేరాలు తగ్గుముఖం పట్టాయి

క్రైమ్ అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్

**విశాలాంధ్ర-కవిటి** : జిల్లాలో నేరాలు రేటు తగ్గుముఖం పట్టాయని జిల్లా నేర విభాగం అడిషనల్ ఎస్పీ టి పి విఠలేశ్వర్ అన్నారు. బుధవారం కవిటి పోలీస్ స్టేషన్ను జిల్లా నేర విభాగం అడిషనల్ ఎస్పీ టి పి విఠలేశ్వర్ సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేశారు. క్రైమ్ రేట్ వివరాలు అడిగి తెలుసుకున్నారు.సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో క్రైమ్ రేటు తగ్గుముఖం పట్టిందని ప్రభుత్వం ఆదేశాల మేరకు ఒరిస్సా సరిహద్దు ప్రాంతాలలో నాటు సారా అక్రమ రవాణా అరికట్టేందుకు ఉక్కు పాదం మోపుతున్నట్లు తెలిపారు.విస్తృత తనిఖీలు, దాడులు చేపట్టి నాటు సారా అక్రమ రవాణా కట్టడికి చర్యలు తీసుకోవాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఇచ్చాపురం సిఐ అర్ ఈ సిహెచ్ ప్రసాద్, కవిటి ఎస్సై రాము పాల్గొన్నారు.

## "ఇన్ఫోసిస్"కు కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపిక

మహిళా డిగ్రీ కళాశాల...

**విశాలాంధ్ర-శ్రీకాకుళం** : స్థానిక కాకినాడ ఆదిత్య మహిళా కళాశాలలో డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న 90 మంది విద్యార్థినులు మంగళవారం నిర్వహించిన ఇన్ఫోసిస్ బి.పి.ఎమ్ క్యాంపస్ డ్రైవ్‌లో కొలువులు సాధించినట్లు కళాశాల డైరెక్టర్ బిఎస్ చక్రవర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థినిలకు శుభాకాంక్షలు తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.శివ శంకర్ మాట్లాడుతూ ఈ పోటీ ప్రపంచంలో ఉద్యోగాలు సాధించడం చాలా కష్టతరమని, అటువంటి తరుణంలో కూడా కాకినాడ ఆదిత్య విద్యా సంస్థలు అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తున్నాయని, ఈ విజయానికి కారణం తమ కళాశాలలో విద్యార్థిని చేరిన మొదటి రోజు నుండి క్యాంపస్ రిక్రూట్మెంట్ ట్రైనింగ్ ఇస్తూ ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. ఇటీవలే విడుదలైన డిగ్రీ పరీక్షా ఫలితాలలో కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల జిల్లాలో మొదటి స్థానంలో నిలిచిన సంగతి విదితమేనన్నారు. ఈ సందర్భంగా విజయం సాధించిన విద్యార్థినిలకు కళాశాల ప్రాంగణంలో అభినందన కార్యక్రమం సభను నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు. విజయాన్నందుకున్న విద్యార్థినిలకు ఆదిత్య విద్యా సంస్థల అధినేత డా. ఎన్. శేషారెడ్డి, సెక్రటరీ డా. ఎన్. సుగునా రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ డా. బి.ఈ.వి. ఎల్ నాయుడు అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకట అప్పారావు, ప్లేసెమెంట్ ఆఫీసర్ టి. శ్రీనివాస రావు, కంప్యూటర్ విభాగాధిపతి ఎల్. ప్రసాద రావు,సి ఆర్ టి విభాగాధిపతి పి.మంగరాజు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

**ఆర్ట్స్ కాలేజీ రోడ్డులో** గల కాకినాడ శ్రీ ఆదిత్య కళాశాలలో డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న 108 మంది విద్యార్థులు మంగళవారం నిర్వహించిన ఇన్ఫోసిస్ బి.పి.ఎమ్ క్యాంపస్ డ్రైవ్‌లో కొలువులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ వీ వేణుగోపాల్ తెలిపారు. ఈ పోటీ ప్రపంచంలో ఉద్యోగాలు సాధించడం చాలా కష్టతరమని, అటువంటి తరుణంలో కూడా కాకినాడ ఆదిత్య విద్యా సంస్థలు అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తున్నాయని, ఈ విజయానికి కారణం తమ కళాశాలలో విద్యార్థి చేరిన మొదటి రోజు నుండి క్యాంపస్ రిక్రూట్మెంట్ ట్రైనింగ్ ఇస్తూ ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. ఇటీవలే విడుదలైన డిగ్రీ పరీక్షా ఫలితాలలో కాకినాడ ఆదిత్య కళాశాల విద్యార్థులు మంచి ప్రతిభ సాధించారన్నారు. ఈ సందర్భంగా విజయం సాధించిన విద్యార్థినిలకు కళాశాల ప్రాంగణంలో బుధవారం అభినందన కార్యక్రమం సభను నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు. విజయాన్నందుకున్న విద్యార్థినిలకు ఆదిత్య విద్యా సంస్థల అధినేత డా. ఎన్. శేషారెడ్డి, సెక్రటరీ డా. ఎన్. సుగుణా రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ డా. బి.ఈ.వి. ఎల్ నాయుడు అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ చక్రవర్తి, అధ్యాపకులు తదితరులు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

## వసపలో మెగా వైద్య శిబిరం

**విశాలాంధ్ర-కొత్తూరు** : మండలం వసప గ్రామంలో శ్రీకాకుళం మెడికవర్ హాస్పటల్ ఆధ్వర్యంలో బుధవారం మెగా వైద్య శిబిరం జరిగింది, 250 మంది వివిధ అనారోగ్య సమస్యలతో శిబిరానికి వచ్చారు. మెడికవర్ డాక్టర్స్ టీమ్ డాక్టర్ చైతన్య ,డాక్టర్ మౌనికా సింగ్, డాక్టర్ బి.అన్నాజీ, డాక్టర్ ఆర్. ప్రశాంత్, డాక్టర్ శ్యాం ప్రసాద్,డాక్టర్ హరిప్రసాద్‌లు వచ్చిన వారికీ తనిఖీలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీ వర ప్రసాద్ ప్రారంభించారు. స్థానిక సర్పంచ్ వలరౌతు అఫీస్ రావు, ప్రభుత్వాస్పత్రి కమిటీ డైరెక్టర్ ఎం.రామమూర్తి తదితరులు తమ గ్రామంలో ఏర్పాటు చేసి న మెగా వైద్య శిబిరం విజయవంతానికి సహకరించారు.

## శ్రీకృష్ణాపురంలో గడప గడప కార్యక్రమం

**విశాలాంధ్ర-సంతబొమ్మాళి** : మండలం పాలతలగాం పంచాయతీ శ్రీక్రిష్ణపురం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంతబొమ్మాళి మండల ఎంపిపి ప్రతినిధి సభ్యులు మెరుగు అప్పారావు, పిఎసిఎస్ చైర్మన్ కిల్లి గోవింద్, వైస్ ఎంపీపీ సభ్యులు నక్క భీమరావు, పొందల రామకృష్ణ, స్థానిక సర్పంచ్ నక్కెట్ల అప్పన్న, మండల కన్వీనర్ కోత సతీష్ గారు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు శ్రీ రంగం వీరస్వామి, మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు చింతాడ రవణమ్మ శ్యామలరావు, స్థానిక ఎంపీటీసీ ప్రతినిది అప్పలనాయుడు, వైస్ సర్పంచ్ రామారావు, స్థానిక వార్డ్ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు,వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు, కో ఆప్షన్ సభ్యులు, సంత బొమ్మాళి మండల సర్పంచ్‌లు ఎంపీటీసీ, వార్డ్ సభ్యులు, సంబంధిత అధికారులు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి

తహాశీల్దార్ అప్పలరాజు

**విశాలాంధ్ర-కవిటి:** అధికారులతో క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని తహసీల్దార్ ఆర్ అప్పలరాజు క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రమైన కవిటి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సూర్యనారాయణ రెడ్డి అధ్యక్షతన సచివాలయ సిబ్బంది, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ అప్పలరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు అన్ని సేవలు అందుతున్నాయని అలాగే సచివాలయ ఉద్యోగులు ప్రజలతో మమేకమై విస్తృత సేవలు అందిస్తున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో కుల ధ్రువీకరణ పత్రాలు, ఇతర ధ్రువపత్రాలు అందజేసేటప్పుడు సంబంధిత శాఖ ఉన్నత అధికారులకు సమాచారం అందజేయాలని వారి అనుమతితోనే లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ రామచంద్రరావు, సీనియర్ సహాయకులు రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం : ఎస్పీ రాధిక

**విశాలాంధ్ర-మందస** : శాంతిభద్రతలు పరిరక్షణే ధ్యేయంగా తమ సిబ్బంది కృషి చేస్తున్నారని జిల్లా ఎస్.పి జి.ఆర్ రాధిక అన్నారు. బుధవారం మందసలో నూతనంగా నిర్మించే పోలీసు స్టేషన్ భవన నిర్మాణానికి ఆమె భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎల్.డబ్ల్యు.ఇ నిధులు 2 కోట్ల 50 లక్షల రూపాయలతో 7వేల చదరపు విస్తీర్ణంతో ఆధునాతన హంగులతో నిర్మిస్తున్నామని అన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పోలీసుస్టేషన్ నిర్మాణం జరగనున్నట్లు తెలిపారు. నిర్మాణ పనులు 6 నెలల్లో పూర్తి చేసి ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని, కాంట్రాక్టర్లను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విఠలేశ్వరరావు, కాశీబుగ్గ డిఎస్పి శివరామరెడ్డి, కాశీబుగ్గ రూరల్ సి.ఐ శంకరరావు, మందస, వజ్రపుకొత్తూరు ఎస్.ఐలు వై.రవికుమార్, మధుసూధన్, ఎంపిపి డొక్కరి దానయ్య, జెడ్‌పిటిసి సవర చంద్రమ్మ, వైస్ ఎంపిపి కొర్నాన ఆదినారాయణ, సర్పంచ్ సి.హెచ్.ఎల్లమ్మలక్ష్మణరావు, ఎంపిటిసి కంచి బెహరాలు పాల్గొన్నారు.

## టీడీపీతోనే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి : ఎమ్మెల్యే బెందాళం

**విశాలాంధ్ర-కవిటి** : తెలుగుదేశం పార్టీ పాలన తోనే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని ఇచ్చాపురం నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని నెలవంక గ్రామంలో ఎంపీ నిధులతో కమ్యూనిటీ బిల్డింగ్, సీసీ రోడ్డు పనులకు భూమి పూజ కార్యక్రమం ఎమ్మెల్యే బెందాలం అశోక్ చేతుల మీదుగా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ లాడ్స్ నిధులు 3 లక్షల రూపాయలతో కమ్యూనిటీ బిల్డింగ్,రెండు లక్షల రూపాయలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు.గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి బాట పడుతుందని గత మూడు సంవత్సరాలుగా అభివృద్ధి కుంటుపడిందని అన్నారు.ఈ కార్యక్రమంలో దేశం నాయకులు మాజీ జెడ్పిటిసి బెందాళం రమేష్,బార్ల చిన్నబాబు,ఎర్ర బాసు దేవ ప్రధాన్, హరికృష్ణ బిశాయి, తెదేపా నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అన్యమతస్థుల అక్రమ నిర్మాణాలు

**విశాలాంధ్ర-జలుమూరు** : మండలం, ఎచెర్లవానిపేట గ్రామంలో కొంతమంది అన్యమతస్తులు, ప్రభుత్వం నుండి ఎటువంటి అనుమతులు లేకుండా, చర్చి నిర్మాణం పనులు జరుపుతున్నారు. ఈ విషయం తెలిసిన వెంటనే విశ్వ హిందూ పరిషత్, బజరంగ్ దళ్ కార్యకర్తలు గ్రామస్తుల్లో అవగాహన కల్పిస్తూ, స్థానిక రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అనుమతులు లేని నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని, గ్రామస్తులు తెలియజేశారు.

## భూకంపం ఘటనలో జిల్లావాసులుంటే తహసీల్దార్లకు తెలపాలి

- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

**విశాలాంధ్ర -శ్రీకాకుళం** : సిరియా, టర్కీ ప్రాంతాల్లో భూకంపం సంఘటనలో జిల్లా వాసులు ఎవరైనా ఉంటే జిల్లాలోని ఆయా మండలాల తహసీల్దార్లకు కుటుంబ సభ్యుల వివరాలు తెలియజేయాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

## వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలి : ఎమ్మెల్యే

**విశాలాంధ్ర-ఎచ్చెర్ల** : వృత్తి నైపుణ్యంతోనే మెరుగైన అవకాశాలు లభిస్తాయని స్థానిక శాసనసభ్యుడు గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. డాక్టర్ బి.ఆర్అంబేద్కర్ యూనివర్సిటీలో ఏపీ రీజినల్ డైరెక్టర్ ఆఫ్ స్కిల్ డెవలప్మెంట్ అండ్ ఎంటర్ పెన్యూర్ (ఆర్‌డిఎస్‌డి ఈ) ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించనున్న అప్రెంటిస్ అవగాహన కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఐటిఐ చేసిన ప్రతి అభ్యర్థికి అప్రెంటిస్ సౌకర్యం కల్పించాలన్నారు. అలాగే యువతకు ఉద్యోగాల కల్పనకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. పరిశ్రమల్లో స్థానిక యువతకు 75% ఉద్యోగాలు కల్పించాల్సి ఉందన్నారు. డిడి చంద్రమౌళి మాట్లాడుతూ ఐటిఐ పూర్తిచేసిన అభ్యర్థులకు అప్రెంటిస్ కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగానే అప్రెంటిస్ పై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇచ్చెర్ల ప్రభుత్వ ఐటిఐలోని స్కిల్ హబ్లో శిక్షణ పొందిన 26 మందికి షిరిడి సాయి ఎలక్ట్రికల్స్ (కడప)లో ఉద్యోగాలు కల్పిస్తూ నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐటిఐ అడ్మిషన్ల జిల్లా కన్వీనర్ కేఎస్ శ్రీనివాసరావు, కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అందవరపు సూరిబాబు (ఏపీఎస్ ఎస్డిసి) శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నైపుణ్యాభివృద్ధి అధికారులు పిబి సాయి శ్రీనివాస్, డాక్టర్ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

# జగన్‌కు అప్పు రత్న అవార్డు ఇవ్వాలి

- అప్పులమయంగా ఆంధ్రప్రదేశ్
- పంచాయతీల నిధులూ దుర్వినియోగం
- సర్పంచ్‌ల సంఘ జిల్లా అధ్యక్షులు గొండు శంకర్

**విశాలాంధ్ర -శ్రీకాకుళం రూరల్:** రాష్ట్రాన్ని అప్పులమయంగా మార్చిన జగన్‌మోహనరెడ్డికి అప్పు రత్న అవార్డు ఇవ్వాలని సర్పంచ్‌ల సంఘ జిల్లా అధ్యక్షులు, టీడీపీ యువ నాయకులు గొండు శంకర్ అన్నారు. నగరంలోని విశాఖ ఎ కాలనీలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2023 బడ్జెట్ అంచనాల ప్రకారం ఏపీ అప్పులు రూ. 4,42,442 కోట్లుగా ఉన్నట్లు కేంద్రం చెప్పిందని అన్నారు. బడ్జెట్‌లో అప్పులకు తోడు కార్పొరేషన్లు, ఇతర మార్గాల్లో అప్పులు అదనంగా ఉన్నాయని కేంద్రం వెల్లడించినట్టు వివరించారు. ఇప్పటికే ఏపీ అప్పులు రూ.10 లక్షల కోట్లకు చేరాయని, "2109లో రాష్ట్ర అప్పులు రూ.2,64,451 కోట్లు ఉండగా.. 2020లో రూ.3,07,671 కోట్లు, 2021లో రూ.3,53,021 కోట్లు, 2022 సవరించిన అంచనాల తర్వాత రూ.3,93,718 కోట్లు, 2023 బడ్జెట్ అంచనాల ప్రకారం ప్రస్తుత ఏపీ అప్పు రూ.4,42,442 కోట్లుగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏటా సుమారు రూ.45 వేల కోట్లు అప్పులు చేస్తోందని ఇది ఎంత మాత్రం సమంజసం కాదని అన్నారు. సర్పంచుల నిధులు, విధులు, అధికారాల సాధన కోసం కేంద్ర ప్రభుత్వం 14,15వ ఆర్థిక సంఘం ద్వారా 12, 918 గ్రామాల సర్పంచులకు పంపిన రూ. 8,660 కోట్లు తిరిగి సర్పంచుల పీఎఫ్ ఎంఎస్ ఖాతాల్లో జమ చేయాలని గొండు శంకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. పాత పద్ధతిలోనే పంచాయతీలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని, గత మూడున్నర సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేసిన గ్రామ పంచాయతీల బకాయి నిధులను కూడా కేంద్రం ప్రకటించిన అప్పునకు ఇది అదనపు అప్పుగా పరిగణించి, వడ్డీతో సహా వెంటనే విడుదల చేయాలని శంకర్ కోరారు.

## ఏపీపీటీడీ జేఏసీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు

**విశాలాంధ్ర -శ్రీకాకుళం రూరల్** : శ్రీకాకుళం 2వ డిపోలో డిపో మేనేజర్ ఉద్యోగులపై పెంచుతున్న పని భారానికి వ్యతిరేకంగా ఏపీపీటీడీ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలలో భాగంగా రెండవ రోజు దీక్షలో వి.ఎస్ నవీన్ బాబు, బి.ఆర్.కృష్ణ, ఎండి. రియాజ్, ఎం ఎస్ రావు, ఎస్ ఎస్ నారాయణలు బుధవారం దీక్షలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు మాట్లాడుతూ డిపో మేనేజర్ ప్రస్తుతం తిరుగుతున్న 13గంటల కొత్తూరు ఓటీ డ్యూటీ ని, సింగిల్ మస్టర్ డ్యూటీ గా పరిగణిస్తామని అనగా 13 గంటల డ్యూటీ లో ఒక్క కిలోమీటర్ కూడా తగ్గించకుండా అన్నే గంటలు తిరగాలనీ ఒక్కరోజు మస్టర్ మాత్రమే ఇస్తామని, కనీసం ఓటీ కూడా ఇవ్వమని చెబుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అంతే కాకుండా ఓవర్ టైం డ్యూటీ లకు ఉద్యోగులను బెదిరిస్తూ బలవంతంగా పనికి పంపిస్తున్నారని, అనారోగ్యం తో బాధ పడుతున్న వారిని కూడా వదలడం లేదన్నారు. కొన్ని దశాబ్దాలు గా పలాస నుండి ఇచ్చాపురం 55 కిలోమీటర్ ల దూరానికి ఎక్స్‌ప్రెస్ సర్వీస్ 1.30 గంటలు ప్రయాణ సమయం కేటాయించే వారని, కానీ శ్రీకాకుళం 2 డిపో మేనేజర్ కేవలం 1 గంట సమయం మాత్రమే కేటాయించారన్నారు. పలాస నుండి ఇచ్చాపురం నకు 3 రైల్వే గేటు లు, ఒక టోల్ గేట్ కూడా ఉన్నాయని, గతంలో ఆర్టీసీ విసి, ఎండి ఎక్స్‌ప్రెస్ సర్వీస్ గంటకు 45 కిలోమీటర్ లు ప్రయాణించాలని సర్క్యులర్ ఇచ్చారని, కానీ శ్రీకాకుళం- 2 డిపో మేనేజర్ 55 కిలోమీటర్ ల ప్రయాణానికి 1 గంట కేటాయించడం అనేది వీసీ అండ్ ఎండీ ల ఆదేశాలను విస్మరించడమేన్నారు. ఈ డిపో మేనేజర్ ఆధ్వర్యంలో ఇచ్చే ఛార్జ్ షీట్ లు, పనిష్మెంట్ లు కోకొల్లలన్నారు. గతం లో ఉద్యోగ భద్రత లో భాగంగా ఇచ్చిన 1/19 సర్క్యులర్ ఈ డిపో మేనేజర్ కి అసలు పట్టనే పట్టదన్నారు. "అంతా నా ఇష్టం" అనే ధోరణిలో ఈయన నిర్వాకం ఉందని, ఎంతో ఉదారతతో మమ్మల్ని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించినప్పటికీ మీరు ఇలా హింసించడం సరికాదని, తమరు చట్ట ప్రకారం నడుచుకొని తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

## అభివృద్ధి పనుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదు

మున్సిపల్ చైర్మన్ బల్ల

**విశాలాంధ్ర-పలాస** : మున్సిపాలిటీ అభివృద్ధి పనుల్లో అలసత్వం వహిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. బుధవారం పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ వరిది సుబ్బమ్మ కాలనీ వీధిలో 14వ ఆర్థిక సంఘం నిధులు 6 లక్షల 70వేల రూపాయలతో రహదారి పనులకు ఆయన భూమి పూజ చేశారు. అంతకు ముందు కె.టి రోడ్డు డ్రైనేజీ పనులను మున్సిపల్ కమిషనర్ రాజగోపాల్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని, మంత్రి సహకారంతో మున్సిపాలిటీ ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దే విధంగా పనులు చేపట్టడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమం లో కౌన్సిలర్ బొర చంద్రకళ, వైస్‌చైర్మన్లు బొర క్రిష్ణారావు, మీసాల సురేష్‌బాబులు పాల్గొన్నారు.

# పోరాట యోధుడు అప్పయ్యదొర

పలాస మున్సిపాల్టీ చైర్మన్ గిరిబాబు

**విశాలాంధ్ర-పలాస** : ఎటువంటి లాభాపేక్ష లేకుండా రాజకీయాలను నడిపిన దివంగత మాజీ ఎంపి హనుమంతు అప్పయ్యదొర పోరాట యోధుడని పలాస కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. బుధవారం అప్పయ్యదొర 88వ జయంతి సందర్భంగా కాశీబుగ్గ కె.టి రోడ్‌లో గల దొర విగ్రహం వద్ద ఆయన కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాయితీకి, నిబద్ధతకు నిలువుటద్దం అప్పయ్యదొర అని, ఆయన రాజకీయ జీవితం నేటి తర రాజకీయ నేతలకు ఆదర్శమని, ఆయన ఆశయాలను, లక్ష్యాలను కొనసాగించేందుకు కృషి చేయాలని అన్నారు. అప్పయ్యదొర రాజకీయాలు పార్టీలకతీతంగా, ప్రజల కోణంతో ఆలోచించేవారని, ఈ ప్రాంత అభివృద్ధికి ఆయన ఆలోచనలు చాలా కీలకమని అన్నారు. దొర సోదరుడు వెంకటరావు మాట్లాడుతూ ఈ ప్రాంత రైతుల కష్టాలు తీర్చాలనే ముందు చూపుతో ఆఫ్‌షోర్ ప్రాజెక్ట్ రూపకల్పన చేసి, దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా శంఖుస్థాపన చేసిన విషయాన్ని గుర్తు చేశారు. వైసీపీ పాలనలో ఆఫ్‌షోర్ పనులు పూర్తి చేయగల సామర్థ్యం కలిగిన వ్యక్తులకు పనులు అప్పగించి పూర్తి చేస్తామని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు తెలిపారని, కెబినెట్ సమావేశంలో ఆఫ్‌షోర్ రిజర్వాయరు పనులను చేసేందుకు సాయిక్రిష్ణ ఎంటర్ ప్రైజెస్‌కు టెండరు అయిందని, 825 కోట్ల రూపాయలు మంజూరైనట్లు మంత్రి తెలిపారని అన్నారు. ఆఫ్‌షోర్ రిజర్వాయరుకు సోదరుడు అప్పయ్యదొర పేరు పెట్టాలని కోరారు. బెండి వంతెన, పలాస ఫ్లైఓవరు వంతెనకు దొర గారు శంకుస్థాపన చేశారని, అవి కూడా పూర్తి అయ్యే దశకు చేరుకున్నాయని అన్నారు. అంతకు ముందు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళలు అర్పించారు. అనంతరం బెండిగేటు సమీపంలోని జాతీయ రహదారి పక్కనే గల దొర విగ్రహానికి డాక్టర్ జీవితేశ్వరరావు, దువ్వాడ శ్రీకాంత్, దువ్వాడ హేంబాబుచౌదరిలు పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. హనుమంతు రామ్మోహనదొర (బుజ్జి) మస్టార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వరిశ బాలక్రిష్ణ, రంగారావు, కల్పన దొర, రాజ్యలక్ష్మి భానుశ్రీలతో పాటు వైసీపీ నాయకులు తమ్మినేని శాంతారావు, మామిడి నర్సింహమూర్తి, బడగల బల్లయ్య, నూక రమణ, ఎందుదొర, కొర్రాయి గిరి, మీసాల సురేష్, బమ్మిడి సింహాచలం, తలగాన నర్సింహమూర్తి, కింతలి ధర్మారావు, కొదండ మస్టారు, పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరమణ, ఉంగ సాయిక్రిష్ణ, కౌన్సిలర్లు జోగారావు, పి.ప్రసాదరావు, బల్ల శ్రీనివాస్, ఎస్.రవిలతో పాటు దొర అభిమానులు పాల్గొన్నారు.

**నందిగాంలో** : టెక్కలి మాజీ శాసనసభ్యుడు అప్పయ్యదొర లేని లోటు తీరనిదని నందిగాం మండల ఎంపీపీ నడుపూరు శ్రీరామ్ మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణరావు లు అన్నారు. అప్పయ్య దొర 88వ జయంతి వేడుకల్లో నందిగాం మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో బుధవారం నిర్వహించారు. నందిగాం మండల అభివృద్ధికి ఆయన చేసిన సేవలు మరువలేనివని ఎంపీపీ కొనియాడారు. సందర్భంగా అప్పయ్య దొర విగ్రహానికి ఎంపీపీ నడుపూరు శ్రీరామ్ మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు కురమాను బాలకృష్ణారావు, ఎంపీపీ సువ్వారి వసంత్ కుమార్, చిన్ను జోగారావు, కింతల శేషగిరి, చింతాడ శ్రీనివాస్, ఆంబోడి విష్ణు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# ప్రతి ఒక్కరి సంతోషమే ధ్యేయం

జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

**విశాలాంధ్ర-కంచిలి:** రాష్ట్రంలో ప్రతి ఒక్కరి సంతోషమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని జడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే, ఇచ్ఛాపురం నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ అన్నారు. మండలంలోని బూరగాం గ్రామంలో బుధవారం సాయంత్రం 167వ రోజు గడప గడపకు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి అందిస్తున్న సంక్షేమ పథకాలను గురించి వివరించారు. రానున్న ఎన్నికల్లో మళ్ళీ జగన్ మోహన్ రెడ్డిని గెలిపించి ముఖ్యమంత్రి చేయాలని కోరారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చిన ఘనత జగన్మోహన్ రెడ్డి దే అన్నారు. రైతుల కోసమే కాకుండా అన్ని వర్గాల కోసం ప్రత్యేకమైన సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పైల దేవదాసు రెడ్డి, పి.ఏ సిఎస్ అధ్యక్షుడు గుమ్మడి రామదాసు, వైసిపి మండల అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయం, ఇచ్చాపురం ఏఎంసి అధ్యక్షుడు నూతలపాటి బాబురావు, ఏఎంసీ మాజీ చైర్పర్సన్ ఎం మంజు, కురా గౌడో, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆధార్ సీడింగ్ వేగవంతం చేయండి

**విశాలాంధ్ర-ఇచ్ఛాపురం** : ఓటరు సంఖ్యతో ఆధార్ సంఖ్యను అనుసంధానం చేసే ప్రక్రియను వేగవంతం చేసి లక్ష్యాలు చేరుకోవాలని ఈ.ఆర్.ఓ సుమబాల అన్నారు. బుధవారం ఇన్‌ఛార్జి తహాశిల్దార్ ఎస్.గురుప్రసాద్, ఎన్నికల ఉప తహాశిల్దార్ శ్రీహరిలతో కలసి పట్టణంలో పర్యటించిన ఆమె పలు ప్రాంతాల్లో ఆధార్ సీడింగ్ విధానాన్ని పరిశీలించారు. అనంతరం స్థానిక తహాశిల్దార్ కార్యాలయంలో బి.ఎల్.ఓలతో సమీక్ష నిర్వహించారు. ప్రతీ ఓటరు ఆధార్ సంఖ్య సేకరించి అనుసంధానించాలని కోరారు.

పురపరిపాలన శాఖ

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం

షార్ట్ టెండర్ నోటీసు

రేఖా నెం. 1432/2022-E1/-. 1st Call BOQ No's 616A, 640A-642A, 796    తే:09-02-2023ది

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో 14వ ఆర్థిక సంఘ నిధులతో చేపట్టు పనులకు ఇ-ప్రొక్యూర్మెంటు ద్వారా టెండర్లు పిలవబడుచున్నవి.

పనుల సంఖ్య : 5    అంచనా విలువ సుమారు రూ. 47.60 లక్షలు

| | | |
|---|---|---|
| Bid Document Download start Date & Time | 09-02-2023 | 11.00 AM |
| Bid Document Download End Date & Time | 17-02-2023 | 03.00PM |
| Bid Submission Closing Date & Time | 17-02-2023 | 03.30PM |
| Bid Document Open Date & Time | 17-02-2023 | 04.30PM |

మిగతా వివరములకు ఆఫీసు పనివేళల్లో తెలుసుకొనవచ్చును మరియు అంతర్జాలములో https://tender.apeprocurement.gov.in

// సం.// టి.రాజగోపాలరావు
కమిషనర్,
పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం

# ప్రాణదాతలు సూపర్ హీరోలు

- స్వచ్ఛంద రక్తదాన శిబిరం విజయవంతం

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: ప్రాణాలను నిలబెట్టే రక్తదానం చేసే ప్రతి ఒక్కరూ సూపర్ హీరోలు అని ప్రముఖ చిన్నపిల్లల వైద్యనిపుణులు మెడికవర్ డాక్టర్ సీపాన రాజేష్ అన్నారు. ప్రాణదాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురుగుబెల్లి చంద్రశేఖర్ నిర్వహణలో స్థానిక డే అండ్ నైట్ జంక్షన్ వద్ద ఉన్న న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంక్ లో బుధవారం స్వచ్ఛంద రక్తదాన శిబిరం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ చిన్నపిల్లల వైద్యనిపుణులు డాక్టర్ సీపాన రాజేష్, మహిళా పారిశ్రామికవేత్త డాక్టర్ యార్లగడ్డ గీతా శ్రీకాంత్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తం కొరత వలన ప్రాణాలు కోల్పోతున్నారని, అటువంటి వారందరికీ రక్తదాతలు ఇచ్చే రక్తం సంజీవని అని పేర్కొన్నారు. అత్యవసర స్థితిలో ఉన్న రోగికి రక్తం అవసరం ఉంటుందని, రోడ్డు ప్రమాద ఘటనల్లో గాయపడి సకాలంలో రక్తం అందక చనిపోయినవారు ఎక్కువ సంఖ్యలో ఉంటున్నారని తెలిపారు. నేటికీ రక్తదానంపై చాలామందికి సరైన అవగాహన లేదు అని, రక్తదానం చేస్తే నీరసించిపోతామని, బలహీనపడి పోతామనే అపోహ ప్రజల్లో ఉందని చెప్పారు. ఇటువంటి అపోహలను ప్రజలు దూరం పెట్టాలని, రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యం మరింత మెరుగ్గా ఉంటుందని వారు తెలిపారు. తరచుగా ప్రాణదాత ఫౌండేషన్ ఇటువంటి రక్తదానం శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయ మన్నారు. ముఖ్యంగా తలసేమియా పిల్లలను దత్తత తీసుకుని వారిని ఆదుకోవడం అన్నది చాలా గొప్ప విషయమని వక్తలు కొనియాడారు. ఈ స్వచ్ఛంద రక్తదాన శిబిరంలో సుమారు 50 మంది యువత రక్తదానం చేశారు. రక్తదాతలకు అతిథులు చేతులమీదుగా సర్టిఫికెట్లు అంద జేశారు. ఈ కార్యక్రమంలో న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంకు మేనేజర్ టి మణికంఠ, ప్రాణదాత ఫౌండేషన్ వ్యవస్థాపకులు డోకి శ్రవణ్ కుమార్, సీపాన అప్పలనాయుడు, పైడి ధర్మారావు, పొట్నూరు ప్రతాప్, బి అప్పలనాయుడు, పేడాడ లక్ష్మణరావు, తిరుపతి రావు, జిల్ ఫౌండేషన్ సత్యసాయి, పోతురాజు శ్రీధర్, శ్రీకాంత్, మణిశర్మ, యునైటెడ్ ఎన్జీవోస్ ఫౌండర్స్, తదితరులు పాల్గొన్నారు.

# రాబేయే ఎన్నికల్లో విజయఢంకా మోగించాలి

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : ప్రతిపక్ష నాయకుని హోదాలో వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి ప్రకటించిన హామీలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొద్ది రోజుల్లో 98% నెరవేర్చి రికార్డు సృష్టించారని జిల్లా పరిషత్ ఛైయిర్పర్సన్ పిరియ విజయ, నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త పిరియ సాయిరాజ్, మున్సిపల్ ఛైయిర్పర్సన్ పిలక రాజలక్ష్మిలు అన్నారు. బుధవారం వై.ఎస్.ఆర్ మున్సిపల్ కళ్యాణమండపంలో మున్సిపాలిటీ పరిధి 10 జగనన్న సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథుల శిక్షణ సమావేశము, అవగాహన సదస్సు నిర్వహించగా ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరూ జగనన్న సైన్యం అని, రానున్న ఎన్నికలలో మరోసారి వైసిపి విజయఢంకా మ్రోగించేలా కృషి చేయాలని అన్నారు. అందుకు సచివాలయ కన్వీనర్లు గృహసారథులు సమిష్టిగా ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించి ప్రజలకు ప్రభుత్వ విధానాలు వివరించాలని కోరారు. ప్రతి సచివాలయానికి ముగ్గురు కన్వీనర్లు, ప్రతి వాలంటరీకి ఇద్దరు గృహసారథులని నియమించడం జరిగిందని, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా అంతా పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలన్నీ మున్ముందు అందరికీ అందాలంటే మరోసారి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలని అవగాహన కల్పించారు. వచ్చే ఎన్నికల్లో పోటీ పేదవాడికి, పెత్తందారి వ్యవస్థకు మధ్య జరుగుతుందని, పేదలు గెలవాలంటే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి విజయాన్ని అందించాలన్నారు. పార్టీలకతీతంగా ప్రతి ఒక్క నిరుపేద కుటుంబానికి నవరత్నాలు అందించే ఘనత ముఖ్యమంత్రిదే అని ప్రతి గడపకి తెలియజేయవలసిన బాధ్యత కన్వీనర్లు గృహ సారథులకు ఉందన్నారు. గత ప్రభుత్వం 612 హామీలు ఇచ్చి ఒక్కటి కూడా నెరవేర్చకుండా ప్రజలకు మోసం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రీనింగ్ & బ్యూటిఫికేషన్ చైర్మన్ నర్తు రామరావు, సీడ్ ఏపి చైర్మన్ సాడి శ్యాంప్రసాద్, రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరావు డి.సి.ఎం.ఎస్ ఛైయిర్ పర్సన్ సల్ల సుగుణ, మున్సిపల్ వైస్ ఛైయిరపర్సన్ లాభాల స్వర్ణమణి, నియోజకవర్గ వాణిజ్య విభాగం కన్వీనర్ 20వ వార్డు కౌన్సిలర్ తాడి ఆది రెడ్డి, కౌన్సిలర్లు పిలక ఈశ్వరి, లక్ష్మి, చిడిపోతు జగన్, పి.మధు, జి.సామ్యుల్, కో-ఆప్షన్ సభ్యులు సాలిన డిల్లిరావు, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# భద్రత మీ జీవితానికి సురక్ష

ప్రమాద రహిత జిల్లాగా శ్రీకాకుళం

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్ : రహదారి భద్రత మీ జీవితానికి సురక్ష అనే నినాదంతో శ్రీకాకుళం జిల్లా రవాణా శాఖ చేపట్టిన ప్రత్యేక అవగాహనా సదస్సులు, ర్యాలీలు, సభలు వల్ల రహదారి ప్రమాదాలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. దీనివల్ల ఎన్నో నిండు ప్రాణాలు కాపాడగలిగామని శ్రీకాకుళం జిల్లా ఉపరవాణా కమిషనర్ సి.హెచ్.శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రమాద రహిత సమాజం కోసం అన్ని వర్గాల సహకారాన్ని తీసికొని శ్రీకాకుళం జిల్లాను సురక్షిత జిల్లాగా, ప్రమాద రహిత జిల్లాగా తయారుచేయటం తమ ప్రథమ కర్తవ్యమని శ్రీకాకుళం జిల్లా రవాణా శాఖ ఉప రవాణా కమిషనర్ సి హెచ్.శ్రీదేవి అన్నారు. భద్రతా వారోత్సవాలు కేవలం వారం రోజులపాటు మొక్కుబడిగా నిర్వహించకుండా, ఒక నిరంతర ప్రక్రియగా చేస్తూ ముందుకు సాగుతున్నామని తద్వారా మంచి ఫలితాలు వస్తున్నాయని ఆమె అన్నారు. ప్రతీ పాఠశాలల్లో, విద్యాలయాల్లో, కాలేజీ, పి.జి.సంస్థలు,ఇంజినీరింగ్, మెడికల్ కాలేజిస్ ల్లో పెద్దఎత్తున రోడ్ సేఫ్టీ పై అవగాహన కల్పించామని అన్నారు. పోలీస్,మెడికల్, ఆర్.టి.సి., రహదారి మరియు భవనాలు శాఖల సహకారాన్ని తీసికొని రహదారి భద్రతపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని శ్రీదేవి వెల్లడించారు.జాతీయ రహదారిపై ఎక్కువ సంఖ్యలో ప్రమాదాలు జరిగేవని ఇటీవల శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ సహకారాన్ని తీసికొని జాతీయ రహదారి అధికారులు సంపూర్ణ సహకారాన్ని తీసికొని తరుచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు.నెలకు సుమారు సరాసరి 30 ప్రమాదాలు జరిగే శ్రీకాకుళం జిల్లాలో ప్రస్తుతం 10 నుండి15 మాత్రమే జరుగుతున్నాయని,వీటిని పూర్తిగా నియంత్రించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. గడిచిన మూడు నెలలుగా వాహనదారులు సుమారు 5వందల మంది ప్రభుత్వానికి టాక్సీ పన్నులు చెల్లించటం లేదని తక్షణమే బకాయి దారులు వాహనాల పన్నులు చెల్లించి ప్రభుత్వానికి సహకరించాలని శ్రీదేవి విజ్ఞప్తి చేశారు. మొండి బకాయి దారులపై జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. అపరాధరుసుం లేకుండా రవాణా శాఖ కు బకాయి పడిన అన్ని రకాల వాహనదారులు వెంటనే పన్నులు చెల్లించాలన్నారు.. శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా బకాయిలు వసూళ్ళ కు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని చెప్పారు.

# మహాశివరాత్రి సందర్భంగా పందిర్రాట మహోత్సవం

విశాలాంధ్ర-జలుమూరు : దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీ ముఖలింగేశ్వర క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఈనెల 18వ తారీకు నుంచి 20వ తారీకు వరకు జరుగుతున్న సందర్భంగా లోక కళ్యాణార్థం లక్షలాది భక్తులు జాతరకి తరలివస్తున్న సందర్భంగా ఎవరికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు, దిగ్విజంగా స్వామిని దర్శించుకునే విధంగా శుభస్తంభ పందిరి రాట కార్యక్రమం బుధవారం నిర్వహించారు. వారాహి సమేత శ్రీ శ్రీ ముఖలింగేశ్వర స్వామి జన్మ నక్షత్ర ప్రకారం పుబ్బ నక్షత్రము లో శుభ స్తంభాలాట దేవాదాయ శాఖ ట్రస్ట్ బోర్డ్, ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో వేశారు. బుధటవారం నుంచి జాతర ముస్తాబు ప్రారంభమవుతుందని ట్రస్ట్‌బోర్డు సభ్యులు తెలియజేశారు. అలాగే పందిరి రాట వేసిన అనంతరం, ధర్మకర్తల మండలి సభ్యులు మరియు ఆలయ అర్చకస్వాములు మహాశివరాత్రి పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో ప్రభాకర్ రావు, ట్రస్ట్ చైర్మన్ కంచి రెడ్డి లింగమూర్తి, ఆలయ ప్రధాన అర్చకులు నాయుడుగారి రాజశేఖర్, సర్పంచ్ తమన్న సతీష్, పెద్ద పూజారి శేషాద్రి కొండయ్య, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమానికి కృషి : ఎంపిపి దానయ్య

విశాలాంధ్ర-మందస : రైతుల సంక్షేమానికి వైసీపీ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపిపి డొక్కరి దానయ్య అన్నారు. బుధవారం టంగారపుట్టి పంచాయతీలో శ్రీవాసుదేవ్ జీడి మామిడి రైతు ఉత్పత్తిదారుల సంఘం కలెక్షన్ కేంద్రం నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 లక్షల రూపాయల నిధులతో కేంద్రం భవన నిర్మాణ పనులు చేపడుతున్నామని, ఇందులో 13.50 లక్షల బ్యాంక్ ద్వారా రుణం విడుదలైందని అన్నారు. హార్టికల్చర్ శాఖ నుంచి 11.20 లక్షల రూపాయలు రాయితీ మొత్తం రాగా రైతులు కేవలం లక్ష 50వేల రూపాయలు ఈ కేంద్రానికి వ్యయం చేయాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సవర చంద్రమ్మ, బాలక్రిష్ణ, సవర సవీత, నగేష్, వైస్ ఎంపిపి ఆదినారాయణ, బాలిగాం, మందస పిఎసిఎస్ అధ్యక్షులు సౌర ఢిల్లేశ్వరరావు, అగ్గున సూర్యారావు, క్లస్టర్ ఇన్‌చార్జీ బృందావనం, ఎంపిటిసి సవర ఢిల్లేశ్వరి, కుసుమల, కొండలోగాం సర్పంచ్ సవర సుధాకర్, రోజాఢిల్లీరావు, సాబకోట సర్పంచ్ ప్రతినిధి సవర రాము, వ్యవసాయాధికారి శంకర్ దాసు, సిబ్బంది శ్రీరాము, ఎఫ్.పి.వో చైర్మన్ సవర డెంబూరు, బోర్డు డైరెక్టర్ సవర హరిక్రిష్ణ, రవి, ఖగేశ్వరరావు, భాస్కరావు, లక్ష్మీనారాయణ, వెంకటరావు, సవర భాస్కరావులతో పాటు సర్పంచ్‌లు, రైతులు పాల్గొన్నారు.

# రహదారుల్లో ప్రమాదాల మలుపులు

విశాలాంధ్ర-మెళియాపుట్టి : మండలంలో వేర్వేరు ప్రాంతాలలోనున్న రహదారులలో మలుపులు అధికంగా ఉండడంతో ఆయా రహదారులలో ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉన్న దృష్ట్యా ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పాతపట్నం నుండి మెళియాపుట్టి వచ్చే రహదారిలో సిరియాఖండి, సుందరాడ, అంజనేయపురం, పెద్దపద్మాపురం తదితర పలు గ్రామాలతో పాటు పర్లాకిమిడి నుంచి వచ్చే క్రమంలో మెళియాపుట్టి మండల కేంద్రంలో మహేంద్రతనయ వంతెన వద్ద మలుపులుతో పాటుగా అధికంగా గోతులు ఏర్పడడంతో ప్రమాదాలు జరిగే పరిస్థితులున్నాయని మండల ప్రజానీకం నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి రహదారులకి పక్కగా ఉన్న డొంకలు తొలగించి మలుపుల్లో బోర్డులు ఏర్పాటు చేసినట్లైతే ప్రమాదాలను కొంత వరకు నిలువరించ వచ్చునని పలువురు ఆవేదనను వ్యక్తపరుస్తున్నారు. ప్రస్తుత రోజుల్లో మంచు సైతం కురుస్తున్న నేపథ్యంలో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలు జరిగే పరిస్థితులు ఉన్నట్లు పలువురు తెలియజేస్తున్నారు. అనేక రహదారుల్లో మలుపులతో పాటు రోడ్లు గుంతలతో ఎక్కువగా పేరుకుపోవడంతో ప్రమాదాలు జరుగనున్నాయని ప్రయాణికుల ఆందోళన చెందుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు తూతూ మంత్రపు చర్యలు కాకుండా శాశ్వత ప్రాతిపదికన ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని మండల ప్రజానీకం ముక్తకంఠంతో కోరుతున్నారు.

# అధికార పార్టీ కనుసన్నల్లో ప్రభుత్వ స్థలం దురాక్రమణ..!

- కాసుల కక్కుర్తిలో మునిసిపల్ అధికారి
- చక్రం తిప్పిన చోటా నేత

విశాలాంధ్ర-ఆమదాలవలస : ఖళీ జాగా కనిపిస్తే అక్కడ కబ్జాదారులు గద్దల్ల వాలిపోతున్నారు. అనుమాత్రం రాజకీయ అండ ఉంటే చాలు దొరికిన కాడికి బాగా వేస్తున్నారు. అధికార నాయకుల కొనసానలలో ప్రభుత్వ స్థలాలను దర్జాగా దురాక్రమణ చేస్తున్నారు. నెంబర్ 73 పెద్ద చెరువు ప్రాంతానికి అనుకుని ఉన్న డ్రైనేజీ అవుట్ లెట్ వద్ద ఉన్న స్థలాన్ని కబ్జాదారుడు తన వశం చేసుకున్నాడు. మురుగునీరు పారే ప్రాంతంలో కనీసం మురుగు కాలవ క్లీన్ చేసేందుకు కూడా వీలు లేకుండా సిమెంట్ పలకలతో మూసివేశారు. దీనికి అధికార పార్టీకి చెందిన మునిసిపల్ చోటా నాయకులు చక్రం తిప్పి పరిశీలనకు వెళ్లిన మున్సిపల్ అధికారులను సైతం వెనుకకు రప్పించారు. దీన్నిబట్టి కబ్జాదారునికి ఉన్న పలుకుబడి అవగతం అవుతుంది. ఎక్కడికక్కడ ఆక్రమణలు చోటు చేసుకున్నప్పటికీ అధికారులు కన్నులుండి చూడలేని అందుని పాత్ర పోషిస్తున్నారు. వీరికి కబ్జాదారు ఇచ్చిన కాసులే కారణమని స్థానికుల ఆరోపిస్తున్నారు. దౌర్జన్యకారులకే పాలకులు అండగా నిలిచి ప్రభుత్వ స్థలాన్ని అప్పనంగా కట్టబెడుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. ప్రధాన మురుగు కాలువ అవుట్లెట్ వద్ద మొత్తం మూసివేసినప్పటికీ అధికార పార్టీ నాయకులే మద్దతు పలకడం శోచనీయం. ఖాళీ జాగాలు కనిపిస్తే కబ్జా చేసేవారికి పాలకులు సహకరించడంతో సామాన్యులు పరిస్థితి ప్రశ్నార్థకమయింది. ఇప్పటికే ఫుట్పాత్తులు సైతం ఆక్రమించి తోపుడుబండ్లకు రోడ్డుమీద అవకాశం కల్పించి వారి వద్ద నుండి దండుకుంటున్న బడా వ్యాపారులకు అధికారులు కుమ్మకోస్తున్నారన్న వాదన వినిపిస్తుంది. అంతేకాకుండా అధికార పార్టీ నాయకులకు కూడా వారికి అండగా ఉంటూ చట్టవట్టలేసుకుని తిరుగుతుంటే సామాన్యుడు బిక్కుబిక్కుమంటూ పక్కకు ఒదిగిపోతున్నారు. ఎంతటి దురాక్రమంలో జరుగుతున్న అధికారులు మాత్రం కనీస చర్యలు చేపట్టకపోవడం పై వారికి అందుతున్న ముడుపుల కారణమని పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని ప్రభుత్వ స్థలాలను కాపాడాల్సిన బాధ్యత వారి పై ఉందని స్థానికులు అంటున్నారు.ఈ విషయమై టి వి ఎస్ హెచ్ సత్యనారాయణ వివరణ కోరగా పాము పరిశీలనకు వెళ్లామని అధికార పార్టీ నాయకులను ఫోన్ రావడంతో వెనుతిరిగామన్నారు. ఎప్పటికప్పుడు చెత్తను తొలగించేందుకు మ్యాన్ హెూల్ ఉంచాలని చెప్పినప్పటికీ మాటను తిరస్కరించారని అధికారి వాపోయారు.

# విద్యార్థులకు శుద్ధజల ప్లాంట్ మంజూరు

విశాలాంధ్ర-మందస : నాడు-నేడు ఫేజ్-2 పథకం కింద మందస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు శుద్ధజలం అందించేందుకు 5 లక్షల రూపాయలు విలువ చేసే శుద్ధజల ప్లాంట్ ప్రభుత్వం మంజూరు చేసిందని బుధవారం కళాశాలకు అందించారని ప్రిన్సిపాల్ చింతాడ శరత్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు శుద్ధజలం అందించడం ఒక వరమని, మంచినీటిని సద్వినియోగం చేసుకొని ఆరోగ్యవంతులుగా ఉంటే విద్యలో మెరుగైన భవిష్యత్ ఉంటుందని అన్నారు. విద్యార్థులు ప్లాంట్ ఏర్పాటుపట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎం.క్రిష్ణమోహన్, ఆర్.లవకుమార్, బి.ప్రవీణ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

# అర్హులకు ఓటర్ జాబితాలో చోటు కల్పించాలి

- ఆధార్ అనుసంధానం తప్పనిసరి
- జెసి ఎం నవీన్

విశాలాంధ్ర-ఆమదాలవలస : అర్హత కలిగిన యువతకు ఓటరు జాబితాలో చోటు కల్పించాలని బిఎల్ఓలకు జాయింట్ కలెక్టర్ ఎం నవీన్ ఆదేశించారు. బుధవారం తాసిల్దార్ కార్యాలయం లో నిర్వహించిన బియ్యాల వల సమావేశంలో మాట్లాడుతూ బాధ్యతాయుతంగా పనిచేయని వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోబడతాయని హెచ్చ రించారు. ఓటర్ జాబితాకు ఆధార్ కార్డు లింక్ చేయడం ద్వారా జాబితాను నవీకరించ వచ్చు నని స్పష్టం చేశారు. ఆగస్టు నుంచి ప్రారంభమైన ఈ ప్రక్రియలో కనీసం 50 శాతం పనిచేయని బి ఎల్ వాళ్లపై షోకాస్ మెమోలు ఇవ్వాలని తహశీల్దార్ ఎస్ గణపతి రావు కు ఆదేశించారు. మండల పరిధిలో పోలింగ్ కేంద్రాల వారిగా 17 మంది బి ఎల్ వో లు పనితీర అస్పష్టంగా ఉందని నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. ఆధార్ సేకరణ అనుసంధాన ప్రక్రియ, అర్హత గల వారికి ఓటు హక్కు కల్పించడం, అనర్హులను జాబితా నుంచి తొలగించటం వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఆధార్ అనుసంధాన ప్రక్రియ శత శాతం పూర్తి చేయాలని బిఎల్‌వోలకు ఆదేశించారు. అలాగే ఎన్నికల పర్యవేక్షకులు ఎప్పటికప్పుడు జాబితాను సరి చేయాల్సిన అవసరం ఉందన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చ రించారు. మానటరింగ్ అధికారులకు సమీక్షలు నిర్వహించి పురోగతి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ గణపతి రావు, ఎన్నికల డి టి మురలీధర్ నాయక్, శ్రీనివాసరావు, వి ఎల్ వో లు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్యానెల్ న్యాయవాదుల సమావేశం

విశాలాంధ్ర-శ్రీకాకుళం : అధ్యక్షులు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా వారి ఆదేశాల మేరకు కార్యదర్శి జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ, సీనియర్ సివిల్ జడ్జ్ ఆర్ సన్యాసినాయుడు బుధవారం న్యాయ సేవా సదన్ లో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ యొక్క ప్యానల్ న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ న్యాయ సేవాధికార సంస్థ యొక్క ప్యానల్ న్యాయవాదులు న్యాయ సేవాధికార సంస్థకి ఆర్థిక స్తోమత లేని కారణంగా సొంతంగా న్యాయవాదిని నియమించుకునే స్తోమత లేని వారికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఈ పానల్ లాయర్ల కు కేసులు చేయటానికి అప్పగిస్తుందని ఈ ప్యానల్ లాయర్లు ప్రజలకు ఎంతో సేవ చేసే అవకాశం దొరుకుతుందని అన్నారు. పానల్ లాయర్లు అందరూ వారికి అప్పగించిన కేసులు సక్రమంగా చేసి కక్షిదారుల నమ్మకం ఇంకా పెరిగేటట్లు చేసుకోవాలని సూచించారు. వివిధ రకాలైన కేసులు చేసుకునే అవకాశం న్యాయ సేవాధికార సంస్థ ప్యానెల్ లాయర్లుగా లభిస్తుందని కావున న్యాయవాదులందరూ ఈ చక్కని అవకాశాన్ని ఉపయోగించుకొని ప్రజలకు వీలైనంత పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో న్యాయ సేవ అధికార సంస్థ పానెల్ న్యాయవాదులు సత్యభామ, జ్యోతి, సుధారాణి, రేవతి, అంజనీ కుమార్, దామోదర్ రావు మొదలగువారు పాల్గొన్నారు.

# సంచిల కథ కంచికే..!

- గాడి తప్పుతున్న రేషన్ సరుకు
- మామూళ్ల మత్తులో రెవెన్యూ

విశాలాంధ్ర-ఆమదాలవలస : ప్రభుత్వం దారిద్ర రేఖకు దిగువన ఉన్నవారి ఆర్థిక అభ్యున్నతి కోసం పథకాలు రూపొందించి ప్రతిష్టాత్మకంగా అమలు జరపాలని అధికారులకు ఆదేశించినప్పటికీ ఆ పథకాలు పక్కదారి పడు తున్నాయి. అట్టడుగు వర్గాలకు అందాల్సిన ప్రభుత్వ పథకాలు గాడి తప్పుతున్న అన్న విమ ర్శలు ఉన్నాయి.

**సంచులు కథ కంచికే...** మిల్లర్లు ఎఫ్ సి కి, సివిల్ సప్లైకి అందించేందుకుగాను డిఎం సివిల్ సప్లై ద్వారా గోనెసంచులను సంబంధిత మిల్లు యాజమాన్యం పేరున ప్రింటింగ్ చేసి మిల్లర్లకు అందిస్తుంటారు. కరోనా సమయంలో సుమారు 45 లక్షల గోని సంచులు మాయమయ్యాయి. అలాగే కొంతమంది డీలర్ల వద్ద నుంచి 20 రూపాయలకు కొనుగోలు చేస్తున్నట్లు సివిల్ సప్లై అధికారులు పంపిణీదారుల నుంచి వసూలు చేశారు. అయినప్పటికీ కనీసం 10 శాతం కూడా గోని సంచులు రికవరీ కాలేదు. తిరిగి ఆ మొత్తాలను కూడా డీలర్లకు అందించలేదని అభియోగం ఉంది. హమాలీలు, కళాశీలు నిత్యవసర సరుకులు డీలర్లు ఒప్పించి మరికొన్ని నెలలపాటు గోన సంచలనం రికవరీ చేసి సివిల్ సప్లై కూడా ఆముదాలవలస లో నిలువ చేశారు. అయినప్పటికీ పోయిన మొత్తాలకు సాలకపోవడంతో ఇటీవల బదిలీపై వెళ్లిన గోదాం ఇన్చార్జి కు నేటికీ జీతం రావడం లేదు. అంటే ఆయన తను పనిచేసిన చార్జీలో ఉన్నటువంటి మొత్తాలను తరువాత వచ్చిన వారికి అందించలేదని తెలుస్తుంది. రెండున్నర ఏళ్ళు గడుస్తున్న నేటికీ గోనిసంచల చిక్కుముడి వీడలేదు. సివిల్ సప్లై అధికారుల కనుసనల్లోనే గోనిసంచల విభాగం కనుమరుగవుతుందని చెప్పాలి.

**గాడి తప్పిన నిత్యవసర సరుకులు...** ఆమదాలవలసలో కొంతమంది నిత్యవసర సరుకులు పంపిణీ చేసే డీలర్లు సిఎస్‌డిటి లు కనుసనల్లోనే నడుస్తున్నారన్న విమ ర్శలు ఉన్నాయి. బినామీ పేర్లతో, వివాహం జరిగి వేరే ప్రాంతానికి వెళ్లిన వారి పేర్ల మీద కూడా డీలర్ షిప్ లు నడుస్తున్నాయి, ఉద్యోగాలు చేసుకుంటూ కూడా భార్యలకు తోడుగా రేషన్ సరుకులు పంపిణీ చేస్తుంటారు అయినప్పటికీ రెవెన్యూ అధికారులు కన్నులుండి చూడలేని గుడ్డివారీగా నటిస్తుంటారు. నిత్యాసరసం గురుకుల పంపిణీ విధానం గాడి తప్పుతుందన్న విమర్శలు తీవ్ర స్థాయిలో వినిపిస్తున్నాయి. ఇది ఏమని ప్రశ్నించి న వారికి ఎండి ఎం ద్వారా సరుకులు పంపిణీ చేస్తారు కదా డీలర్ ఎవరైతే మీకెందుకులే అని సమాధానాలు ఇచ్చిన సందర్భాలు ఉన్నాయి. అంటే రెవెన్యూ వ్యవస్థ కనుసన్నల్లో ప్రభుత్వం పేదలకు అందించే రేషన్ పక్కదారి పడుతుందని చెప్పాలి. ఇటీవల విజిలెన్స్ అధికారులు దాడుల్లో టన్నులకొద్ది రేషన్ బియ్యం దొరికి నప్పటికీ వాటిని సీజ్ చేసే సమయంలో రెవెన్యూ అధికారులు కనిపించకపోవడం పలు విమర్శలకు దారిస్తుంది. నెలనెలా మామూలుగా కక్కుర్తిపడి ప్రభుత్వ ఆశయాలను మంట కలుపుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఆముదాలవలస ఎం ఎల్ ఎస్ పాయింట్ నుండి 118 రేషన్ డిపోలకు గాను 295 మెట్రిక్ టన్నులు బియ్యాన్ని ప్రతి కోటాకు సరఫరా చేస్తున్నారు. అలాగే 8.5, మెట్రిక్ టన్నుల ఫోర్టిఫైడ్ రైస్ ను ఐసిడిఎస్ ఎండిఎం పాఠశాలకు అందిస్తున్నారు. ఇంత మొత్తంలో బియ్యం సరఫరా అవుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం అందించిన మోడీ బియ్యం మరో 295 మెట్రిక్ టన్నులు బియ్యాన్ని అందించేవారు. డీలర్ వద్ద నుంచి తీసుకున్న మరుక్షణమే మిల్లర్లు ఏర్పాటు చేసిన చిరు వ్యాపారులు వాటిని కొనుగోలు చేసి మిల్లర్లకు అందిస్తున్నారు. వీటినే రీసైకిల్ చేసి తిరిగి ప్రభుత్వానికి లెవిగా అందించడం గమ నార్హం. మధ్యలో ఉన్న రెవెన్యూ, క్వాలిటీ కంట్రోల్, సివిల్ సప్లై అధికారులు మొదలగు వారిని దాటుకొని గోదాముకు చేరుతున్నయంటే మధ్యలో ఎంతమంది చేతులు తడుస్తున్నయో అవగతం అవుతుంది. వైయస్సార్ ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత కొంతమంది డీలర్ల పై విజిలెన్స్ యంత్రాంగం కొరడా దులిపించింది. సుమారు 16 మందిని 6ఏ కేసు నమోదు చేసి వారిని తొలగించి, ఆ స్థానంలో స్థానిక సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు అందించారు. తరువాత కోర్టుకి ఆశ్రయించిన బాధితులు తిరిగి వాటిని వశపర చుకున్నారు. అక్రమంగా ఉన్న వాటిని ఏ కారణాలతో చూపించలేదు, మూడు నెలల్లోగా ఆర్డీవో కోర్టుకే సమాధానం ఇవ్వాలని అప్పట్లో ఇస్తాను ఆదేశాలిచ్చింది. వాటి నిరూపించుకో లేకపోవడంతో మళ్లీ కొంతమందిని తొలగించి సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకి అందించారు. ఆ సమ యంలో లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేసి నందుకు ప్రభుత్వం ఒక కేజీ బియ్యానికి రూపా యివంతున సంబంధిత సెల్ఫీ గ్రూపులకు అందించారు. ఇదే సమయంలో తిరిగి వాటిని డీలర్ కు అప్పగించడంతో సుమారు ఐదు ఆరు నెలలు చేసిన సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు ప్రభుత్వం అందించిన గౌరవ భృతి అందలేదు. రెండేళ్లయి నప్పటికీ స్థానిక డీలర్లు ఖాతాలో ఉన్న మొత్తాల ను సంబంధిత సెల్ఫీలు పురుగులకు అందించ దంలో సి ఎస్ డి టి విఫలమయ్యారని చెప్పాలి. నేటికీ రెవెన్యూ అధికారుల చుట్టూ సెల్ఫ్ హెల్ప్ గ్రూపులో సభ్యులు చక్కర్లు కొడుతున్నారు. వారు పని చేసిన సమయానికి అందించిన గౌరవ వేత నాన్ని కూడా రెండేళ్లయిన అందించలేని స్థితిలో రెవిన్యూ యంత్రాంగం ఉంది. డీలర్లు ఆడిందే ఆటగా వ్యవస్థ నడుస్తుందనటానికి ఇదో ఉదాహ రణగా చెప్పవచ్చు. ఇప్పటికైనా ఉన్నతాధి కారు లు స్పందించి సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు న్యాయం చేయాల్సిన అవసరం ఉంది. ఈ విషయమై సి ఎస్ డి టి అమర్ నాథ్ ను వివరణ కోరగా సంబంధిత డీలర్లతో మాట్లాడామని అకౌంట్లోకి వచ్చిన మొత్తాలను లెక్కించే సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ లకు అందిస్తామన్నారు. గోని సంచల వివాదమై గోదాం ఇంచార్జ్ బుడుమూరు శారదా దేవిని వివరణ కోరగా బదిలీపై తను ఎక్కడికి వచ్చాను అని గోనిసంచల వ్యవహారం తనకు తెలియదని, ఈ సమాచారం ఉన్నతాధికారులు వద్ద ఉంటుందని స్పష్టం చేశారు.

# ఘనజీవామృతంతో బహుళ ప్రయోజనాలు



విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్ : మండలం తండేవలస గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులు చేత 500 కేజీల ఘనజీవామృతాన్ని తయారు చేయించారు. ఇది పంటలకు ఉపయోగించడం వలన పంటకు అవసరమైన సూక్ష్మజీవులు నేలలో అభివృద్ధి చెందుతాయి. రైతులు ప్రకృతి సేద్య విధానంలో పూర్తిగా పంటలను పండించడం వలన నేల సారవంతంగా మారి దిగుబడి కూడా పెరుగుతుందని, పంట పెట్టుబడి ఖర్చు చాలా తక్కువగా అవుతుంది అలాగే దిగుబడి పెరుగుతుందని అందువలన రైతులందరూ కూడా ప్రకృతి సాగు చేపట్టాలని సిబ్బంది ఈశ్వర్ వివరించారు.

# గర్భిణి, బాలింతరాలకు పౌష్టికాహారం

విశాలాంధ్ర-కొత్తూరు : మండలం వసప గ్రామ అంగన్ వాడి కేంద్రంలో బుధవారం గర్భిణీ లు,బాలింతరాల్లు కు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు, గ్రామ సర్పంచ్ వలరౌతు అఫీస్‌రావు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో అంగన్‌వాడి కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణీలు, బాలింతరాలకు వారి ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఈ పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తుందని అన్నారు. ముఖ్యంగా మధ్య తరగతి, క్రింద స్థాయి కుటుంబాలకు ఎంతో ఉపయోగపడుతుంది అని సర్పంచ్ వలరౌతు అన్నారు.